క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కాకినాడ: ప్రజల సౌలభ్యం కోసం ఈ నెల 20వ తేదీ నుంచి 23 వరకు నాలుగు రోజుల పాటు నగరంలోని తొమ్మిది ప్రాంతాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌లోని డాక్యుమెంట్ అప్‌డేట్, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆధార్‌కు మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ అనుసంధానం, బయోమెట్రిక్ అప్‌డేట్ (ఫొటో, ఐరిష్, వేలిముద్ర), పేరు, పుట్టిన తేదీలు, చిరునామాల్లో మార్పులు, కొత్త ఆధార్ నమోదు, ఆధార్ డౌన్‌లోడ్ చేసుకోవడం వంటి సేవలను ఈ శిబిరాల్లో పొందవచ్చన్నారు. కృష్ణనగర్–2ఎ, డెయిరీఫారం–11ఎ, గోలీలపేట–14ఎ, యానాం రోడ్డు–15ఎ, చిన్న మార్కెట్ 21–1, యాళ్ల వారివీధి–28బి, బ్యాంక్‌పేట–32ఎ, గాంధీనగర్–38ఎ, గైగోలుపాడు–50బి సచివాలయాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయని వివరించారు. ఆయా సేవలకు నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఖోఖో బాలికల జట్టుకు కలెక్టర్ అభినందన


ఖోఖో క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి 13 వరకూ విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాకినాడ జిల్లా జయప్రకాష్‌నగర్ సచివాలయం–3కి చెందిన ఖోఖో బాలికల జట్టు మూడో స్థానం సాధించింది. ఈ నేపథ్యంలో ఖోఖో జట్టు సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను కలిశారు. వారు గెలుపొందిన కప్‌ను కలెక్టర్‌కు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన ఖోఖో జట్టు క్రీడాకారులను కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్‌కుమార్, కోఆర్డినేటర్ పి అప్పలనాయుడు, డీఎస్‌డీఓ ఇన్‌చార్జి సతీష్‌కుమార్, జీవీవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో పిల్లల్లో ఆరోగ్యం


రాయుడుపాలెంలో లింగం రవిని అభినందిస్తున్న ఆశా వర్కర్లు

కాకినాడ రూరల్: నులి పురుగుల నిర్మూలనతోనే పిల్లల్లో ఆరోగ్యం కలుగుతుందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టరు లింగం రవి అన్నారు. పాఠశాలలతో పాటు, ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు డీ వార్మింగ్ కోసం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆశా వర్కర్లను కోరారు. రమణయ్యపేట పంచాయతీలోని రాయుడుపాలెం సచివాలయం–2 వద్ద సోమవారం డీ వార్మింగ్ మాత్రలు పంపిణీపై ఆశా వర్కర్లతో ఆయన మాట్లాడారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఆశా వర్కర్లు అభినందించారు.

ఛత్రపతి శివాజీ జయంతి


శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సర్పవరం జంక్షన్‌లో ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పోలీసు శాఖకు చెందిన దిలీప్‌కుమార్, సంఘ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ యుద్ధతంత్రాల్లోనే కాకుండా, పరిపాలన విధానంలో దేశ రాజుల్లో అగ్రగణ్యుడిగా నిలిచారన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాకినాడ సిటీ: విద్యా ప్రదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 109వ వర్ధంతి సందర్భంగా కాకినాడ అర్బన్, రూరల్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సోమవారం ఎంఎస్ఎన్ చార్టీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మల్లాడి సత్యలింగం నాయకర్ జీవిత చరిత్ర, దాతృత్వం అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. ఆరో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులు 162 మంది పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 21న వర్ధంతి సభలో బహుమతులు అందజేస్తారు. వంశ పారంపర్య ధర్మకర్త, చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, చార్టీస్ విద్యా సంస్థల ఈఓ ఆర్వీ చందన, ప్రిన్సిపాల్స్ కె.అమరేశ్వరరావు, ఎంఎస్ సుబ్రహ్మణ్యం, కేసరి శ్రీనివాసరావు, రామకృష్ణ పర్యవేక్షించారు.

జగనన్న అండగా.. వ్యాపారం మెండుగా..

- వీధి వ్యాపారులకు ప్రభుత్వం భరోసా
- వడ్డీ లేకుండా రూ.పది వేల రుణం
- నగరంలో ఇప్పటి వరకూ 9 వేల మందికి లబ్ధి
- వలంటీర్ల ద్వారా అర్హులందరికీ అందేలా నగరపాలక సంస్థ కార్యాచరణ


గాంధీనగర్‌లో తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వర్తకులు

బోట్‌క్లబ్: రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి వ్యాపార పెట్టుబడి కోసం రూ.10 వేలు వడ్డీ లేకుండా రుణం అందిస్తోంది. ఇప్పటివరకూ ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పు తెచ్చుకుని, సంపాదించిన లాభమంతా వడ్డీ కింద పోయేది. రోజుకు రూ.ఐదొందలు సంపాదిస్తే, అందులో రూ.300 నుంచి రూ.400 వడ్డీకే సరిపోయేది. దీంతో ఇల్లు గడవడం వారికి కష్టంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీధి వ్యాపారుల కష్టాన్ని స్వయంగా పాదయాత్రలో చూసి.. చలించి.. వారికి అండగా నిలవాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం వడ్డీ లేకుండా రుణం అందించారు.

కాకినాడ నగరంలో సుమారు తొమ్మిది వేల మంది వీధి వ్యాపారులకు ఇటీవల ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందించింది. అర్హులైన ప్రతిఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరే విధంగా వలంటీర్ల సహకారంతో వీరికి రుణాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు నగరపాలక సంస్థ అధికారులు. నగరంలో సుమారు 70కిపైగా వివిధ బ్యాంకులున్నాయి, ప్రతి బ్యాంకులోను చిరు వ్యాపారులకు కావాల్సిన రుణాలు ఎటువంటి హామీ లేకుండా అందిస్తున్నాయి. దీంతో వీధి వ్యాపారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బ్యాంకుకు వెళ్లి ఏదైనా రుణం అడిగితే, తమకు హామీ కావాలని బ్యాంకు అధికారులు అడిగేవారు. తమకు ఎలాంటి ఆస్తులు లేవని చెబితే రుణం ఇవ్వడం కుదరదని నిర్మొహమాటంగా చెప్పేవారు. నేడు అలా కాకుండా అర్హులైన ప్రతి వీధి వ్యాపారులను గుర్తించి, కార్పొరేషన్ అధికారులు వారికి రుణాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

టీడీపీ హయాంలో కొందరికే..

ముద్ర వంటి రుణాలు టీడీపీ హయాంలో కేవలం పచ్చ పార్టీ సానుభూతిపరులకు మాత్రమే జన్మభూమి కమిటీ సభ్యులు ఇచ్చేవారు. నేడు అలా కాకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ వడ్డీ లేని రుణం అందించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. స్థానిక వలంటీర్లు సహాయంతో వీరికి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవడంతో, ఎక్కడా అనర్హులకు రుణాలందే పరిస్థితి లేదు. దీంతో వీధి వ్యాపారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రుణం అండగా నిలిచింది



లాక్‌డౌన్ కారణంగా చాలా ఇబ్బందులు పడ్డాం. నెలల తరబడి వ్యాపారం చేసుకునే వీల్లేకుండా పోవడంతో ఇల్లు గడవడం చాలా కష్టంగా మారింది. మళ్లీ వ్యాపారం చేసుకునేందుకు ప్రైవేట్ వ్యాపారుల వద్ద నుంచి అధిక వడ్డీకి డబ్బు తెచ్చుకునే క్రమంలో, ప్రభుత్వమే అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇవ్వడం మాకు ఎంతో ఆసరాగా నిలిచింది.

– చాట్ల శ్రీనివాస్‌రెడ్డి, అరటి పండ్ల వ్యాపారి

వడ్డీ భారం తగ్గింది



ప్రతిరోజూ వ్యాపారం చేయాలంటే రూ.3 వేల నుంచి రూ.4 వేల పెట్టుబడి కావాల్సి వచ్చేది. దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి ఎక్కువ వడ్డీకి అప్పు తెచ్చుకుంటే, వచ్చిన ఆదాయం వడ్డీ కిందే సరిపోయేది. ప్రస్తుతం ప్రభుత్వ సాయంతో వ్యాపారం చేసుకుంటునాం. ప్రతిరోజూ రూ.500కి పైగా సంపాదిస్తున్నా. దీంతో కుటుంబంతో సంతోషంగా ఉన్నాం.

– చల్లపల్లి తుక్కేశ్వరరావు, చిరు వ్యాపారి

మత్స్యకారులపై కొండబాబు కపట ప్రేమ

- మున్నెన్నడూ లేనంతగా వీరి కోసం కృషి చేశా
- చేసిన వ్యాఖ్యలు వక్రీకరించి దుష్ప్రచారం
- వనమాడి తీరుపై ద్వారంపూడి ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రాజకీయాల్లో మత్స్యకారుల తరఫు ప్రతినిధిగా కొనసాగుతున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఏనాడూ ఆ వర్గం ప్రయోజనాల కోసం పనిచేసిన దాఖలాలు లేవని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. అధికారం ఉన్నంతసేపూ తన స్వప్రయోజనాల కోసమే మత్స్యకారులను వాడుకున్నారని ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుటుంబాన్ని ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియా వేదికగా వక్రీకరించి మత్స్యకార జాతిని అవమానించినట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మత్స్యకార ప్రాంతాల నుంచి తనకు ఏనాడూ మెజార్టీ రాకపోయినా, రాజకీయాలను పక్కన పెట్టి, వీరి అభ్యున్నతికి ఎంతో కృషి చేశానన్నారు. మత్స్యకార వర్గం నుంచి కర్రి పద్మశ్రీకి ఎమ్మెల్సీ, బందన హరికి అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, చోడిపల్లి ప్రసాద్‌కు డిప్యూటీ మేయర్ పదవి రావడానికి కృషి చేశానన్నారు. మత్స్యకార వర్గానికి చెందిన మల్లాడి సత్యలింగ నాయకర్ విద్యాభివృద్ధి కోసం వేలాది ఎకరాలు దానంగా ఇస్తే, తన హయాంలోనే ఆయన వర్ధంతి, జయంతిలను అధికారికంగా నిర్వహించేందుకు కౌన్సిల్‌లో తీర్మానాలు చేయించానన్నారు. మత్స్యకారులు నివసించే ఏటిమొగ ప్రాంతంలో డ్రైఫిష్ మార్కెట్ అభివృద్ధి, మల్లారమ్మగుడి వద్ద పార్కు సుందరీకరణ, ఏటిమొగ వద్ద కనెక్టింగ్ రహదారులు, బోటు ఓనర్ల సంఘ భవన నిర్మాణానికి తోడ్పాటు, గంగమ్మతల్లి ఆలయానికి స్థల కేటాయింపు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశానన్నారు. దుమ్ములపేటను దత్తత తీసుకున్న కొండబాబు ఆ ప్రాంతాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, తన హయాంలో ఆ ప్రాంతాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దానన్నారు. ముఖ్యంగా కొండబాబు అధికారంలో ఉన్నప్పుడు వేటకు వెళ్లిన బోట్లు దగ్ధమైతే.. బాధితులకు ఏ మాత్రం న్యాయం చేయలేకపోయారన్నారు. ఇటీవల బోట్లు దగ్ధమైతే లక్షల రూపాయలను సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయించానన్నారు. రేవు కార్మికుల్లో 90 శాతం మంది మత్స్యకారులేనని, కనీసం వీరిని కూడా కొండబాబు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తన హయాంలో మత్స్యకారులకు 9,797 ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. నగర పరిధిలో ఉన్న స్థలాన్ని మత్స్యకారులకు కేటాయించేందుకు ప్రయత్నిస్తే, దానిని కూడా కోర్టుకు వెళ్లి అడ్డుకున్న ఘనత కొండబాబుదేనన్నారు. చమురు కార్యకలాపాల కారణంగా నష్టపోయిన మత్స్యకారులకు పరిహారం అందించే విషయంలో యానాం, తాళ్లరేవు ప్రాంతాలకు నష్ట పరిహారం అందజేసిన పొరుగు రాష్ట్రాల నాయకులకు, అప్పుడు ఇక్కడి మత్స్యకారులు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. కొండబాబు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కమీషన్ల కోసం తమిళనాడుకు చెందిన బోట్లకు అనుమతినిచ్చి, ఇక్కడి మత్స్యకారుల పొట్టకొట్టేందుకు ప్రయత్నించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మత్స్యకార్లపై కపట ప్రేమ చూపిస్తూ రాజకీయ లబ్ధి కోసం తనపై దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

గంజాయి వ్యాపారంలో వనమాడి కుటుంబం

కొండబాబు కుటుంబం గంజాయి వ్యాపారం చేస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు తన వద్ద ఆధారాలు ఉన్నాయని, త్వరలోనే వీరిని పట్టిస్తానన్నారు. మత్స్యకార ప్రాంతాల్లోని యువతను గంజాయికి బానిసలను చేసి, పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారని ద్వారంపూడి ఆరోపించారు. బోటు ఓనర్ల ప్రతినిధి వనమాడి వీరబాబు మాట్లాడుతూ కొండబాబు పాలనలో ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలంలోనూ కొండబాబు అడ్రస్ లేరని మండిపడ్డారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, భీమరాజు మాట్లాడుతూ చీప్ ట్రిక్స్‌తో ద్వారంపూడిపై తప్పుడు విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మత్స్యకార ప్రముఖులు కాటాడి జానకిరామ్, పలువురు బోటు యజమానులు, మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే సత్ఫలితాలు


ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆర్‌జేడీ నాగమణి

కరప: పదో తరగతి విద్యార్థులు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే సత్ఫలితాలు సాధించవచ్చని ఆర్‌జేడీ నాగమణి అన్నారు. సమయాన్ని వృథా చేయకుండా, కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల ప్రిపరేషన్‌పై పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, ప్రత్యేక శ్రద్ధతో చదివించాలన్నారు. హెచ్ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఇకముందు కూడా క్రైస్తవులకు అండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉంటుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక దుమ్ములపేటలోని చర్చిలో హౌస్ ఆఫ్ హోప్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సేవకుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సేవకులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.ఐదు వేల పారితోషికం అందించిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని, క్రైస్తవ సేవకుల సహాయ సహకారాలు అందించాలని కోరారు. పాస్టర్లు అనిల్‌కుమార్, మోసాజాన్, రాజు, విజయ్‌కుమార్, 400 మంది క్రైస్తవ సేవకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే


వలసపాకలలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల, జెడ్పీటీసీ రామకృష్ణ

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో కృష్ణుడిగుడి నుంచి రావిచెట్టు వరకు రూ.12 లక్షలతో నిర్మించిన ఈ రోడ్డుతో పాటు యాదవపేటలో రూ.6 లక్షలతో నిర్మించిన రోడ్డు, మరికొన్ని రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి ఎమ్మెల్యే కన్నబాబుకు ఘన స్వాగతం పలకగా, మహిళలు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ నాయకులు రెడ్డి నాయుడు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి భూమిపూజ


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కరప: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక గ్రంథాలయం వీధిలో సోమవారం జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలోని కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం ఎంతోకాలం నుంచి ఈ ఆలయ నిర్మాణానికి స్థలం, నిధులివ్వాలని కోరుతున్నారని చెప్పారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి కరపలో స్థలం కేటాయించి, రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. పనులు ప్రారంభించి, ఆలయ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు అన్నప్పాచార్యులు, అధ్యక్ష, కార్యదర్శులు వై.వీరబ్రహ్మం, వి.మల్లేశ్వరరావు, కె.గోవిందాచార్యులు, వి.సత్యనారాయణ, డి.శ్రీను, వి.సత్తిబాబు పాల్గొన్నారు. తర్వాత శివగంగ రజక సంఘం కమ్యూనిటీ హాలు, మెయిన్‌రోడ్డు ఎస్సీవీధిలోని అంబేడ్కర్ విగ్రహానికి షెల్టర్ నిర్మాణ పనులకు ఎంపీపీ, జెడ్పీటీసీలు భూమిపూజ చేశారు. ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, శివగంగ రజక సంఘం ప్రతినిధులు సైనవరపు సత్యనారాయణ, మురమల్ల నాగేశ్వరరావు, సైనవరపు సతీష్, మంచాల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు కాకినాడ ఈశ్వరరావు, ఓదూరి వెంకటరమణ, ఎం.అప్పారావు, ఎస్.నూకరాజు, కాకినాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు మరింత విస్తృతం చేయాలి


బాలకృష్ణ దంపతులు, విశ్వేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: సమాజ సేవ చేయడానికి లయన్స్ క్లబ్‌లు మంచి వేదికగా నిలుస్తాయని, వాటి సేవలు మరింత విస్తృతం చేయాలని సంస్థ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక రామారావుపేట లయన్స్ హాల్లో క్లబ్ ప్రెసిడెంట్ రామసుబ్రహ్మణ్యం 22 అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో బాదం బాలకృష్ణ, కుసుమ దంపతులు, మంజులూరి విశ్వేశ్వరరావు, రమా సుందరి దంపతులను సోమవారం సాయంత్రం సత్కరించారు. లయన్స్ ఫౌండేషన్ ద్వారా సుమారు 30 వేల మందికి మధుమేహ పరీక్షలతో పాటు, దాదాపు వంద అవగాహన కార్యక్రమాల నిర్వహణకు రూ.40 లక్షలు మంజూరు చేశారని, ఈ ప్రాజెక్టును పది రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు.

ఘనంగా మధ్వ నవమి వేడుకలు

బోట్‌క్లబ్: జగద్గురు మధ్వాచార్యులు బదరికాశ్రమ ప్రవేశం సందర్భంగా నిర్వహించే మధ్వనవమి వేడుకలు స్థానిక రామారావుపేటలోని మధ్వసభ ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత మధ్వసభ కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్రస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు సుమారు నాలుగు గంటల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. మధ్వాచార్యులవారి విగ్రహానికి తేనాభిషేకాన్ని పరశురామాచార్ నిర్వహించారు.

21న సిరిపురం గ్రామ దేవతల తీర్థం

కరప: మండలంలోని సిరిపురం గ్రామ దేవతలైన గోగులమ్మ, మహాలక్ష్మమ్మ తీర్థం ఈ నెల 21న జరుగుతుందని ఆలయ ధర్మకర్త చిక్కాల వీరవెంకట సత్యనారాయణ సోమవారం తెలిపారు. 20వ తేదీ రాత్రి అమ్మవార్లకు జాతర, 21న తీర్థం జరుగుతుందన్నారు. గ్రామ దేవతలను దర్శించుకున్న ఆడపడచులందరికీ చీరలు కానుకగా ఇస్తున్నట్టు తెలిపారు.

పేదల పక్ష ప్రభుత్వం మాది

- మాజీ మంత్రి కురసాల కన్నబాబు
- వలసపాకలలో మత్స్యకార కల్యాణ మండపం ప్రారంభం


మత్స్యకార ఫంక్షన్ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రజల మనసు చూసి, పేదల పక్షాన పని చేసే ప్రభుత్వం తమదని, మత్స్యకారుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. వలసపాకల పల్లెపేటలో కోరమండల్ సీఎస్ఆర్ నిధులు రూ.94 లక్షలతో అత్యంత అధునాతనంగా నిర్మించిన అగ్నికుల క్షత్రియ(మత్స్యకార) కల్యాణ మండపాన్ని కోరమండల్ సంస్థ మాన్యుఫ్యాక్చరింగ్ హెడ్, ప్రెసిడెంట్ అమీర్ ఆల్వీతో కలిసి కన్నబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఈ ఫంక్షన్ హాల్ కాకినాడలోని పెద్ద ఫంక్షన్ హాళ్ల స్థాయిలో ఉందన్నారు. మత్స్యకారుల వినతి మేరకు ఫంక్షన్ హాలు కోసం కోరమండల్‌ను కోరగా, రూ.94 లక్షలతో నిర్మించిందని చెప్పారు. మరో రూ.6 లక్షల ప్రభుత్వ నిధులతో ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. అందరి సహకారంతో ఏసీ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కోరమండల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు చెప్పారు. 2019 నుంచి ఇప్పటి వరకూ చాలా అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గంలో సుమారు 80 సామాజిక భవనాలు, మత్స్యకారులకు ఐదు కమ్యూనిటీ హాళ్లు నిర్మించామన్నారు. మత్స్యకారులు, శెట్టిబలిజ, కాపులు, బ్రాహ్మణులు, వైశ్యులు, కొప్పులవెలమ, ఎస్సీల కోసం నిర్మాణాలు చేశామన్నారు. అంబేడ్కర్ విశ్రాంతి భవనాలు నిర్మించామన్నారు. మరోసారి తనకు అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులకు తాను అండగా ఉన్నానని, రమణయ్యపేట చేపల మార్కెట్‌ను తొలగించే ప్రయత్నాలు జరిగితే, తాను అడ్డుకున్నానని గుర్తుచేశారు. వాకలపూడిలో గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మత్స్యకార సామాజిక భవన నిర్మాణం ప్రారంభించామని, తర్వాత వచ్చిన ప్రభుత్వం ఐదేళ్లు దానిని పట్టించుకోలేదని విమర్శించారు. తిరిగి తాను ఎమ్మెల్యే అయ్యాక కోరమండల్ సంస్థ సహకారంతో నిర్మాణం చేపట్టామన్నారు. సంస్థ ప్రెసిడెంట్ అమీర్ ఆల్వీ మాట్లాడుతూ ఫంక్షన్ హాలును వందేళ్లు సేవలందించేలా నిర్మించామని, మూడో అంతస్తు వేసుకోవచ్చని తెలిపారు. స్థానిక మత్స్యకారులు వీరవేణి, కామరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించారని, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, కోరమండల్ హెచ్ఆర్ హెడ్ వైస్ ప్రెసిడెంట్ రాజా, ప్లాంట్ కాకినాడ హెడ్ శ్రీనివాసరావు, హెచ్ఆర్ పద్మనాభం, సీఎస్ఆర్ ఇన్‌చార్జి వంశీ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



రమణయ్యపేటలో నిర్వహించిన ర్యాలీలో డీఈఓ రమేష్ తదితరులు

కాకినాడ రూరల్: ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి, డీఈఓ పి.రమేష్ కోరారు. రమణయ్యపేట ఈశ్వర్ నగర్‌లో మోహన్ విద్యా సంస్థలో స్వీప్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. స్వీప్ కమిటీలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ కళారూపాల ద్వారా ఓటు విలువను చాటి చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివప్రసాద్, సమగ్ర శిక్షా ప్రణాళికాధికారి సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు గణేష్‌బాబు, ఏసుదాసు, మోహన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులకు వేగంగా పరిష్కారం

స్పందన, డయల్ యువర్ కమిషనర్‌లో అదనపు కమిషనర్


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఫోన్ ద్వారా, నేరుగా వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడున్న అధికారులను ఆయన ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలకు మొత్తం 17 మంది దరఖాస్తులు అందజేశారు. ఆయా సమస్యలను వేగంగా పరిష్కరించి, అందుకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారులకు అందజేయాలని ఏడీసీ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు. అలాగే ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరీల్, ఏఓ శిరీష్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కరాటేలో సాయిరఘుకు గోల్డ్ మెడల్


సినీ నటుడు సుమన్ నుంచి గోల్డ్ మెడల్ స్వీకరిస్తున్న సాయిరఘు

కరప: హైదరాబాద్‌లోని రుద్రమదేవి సెల్ఫ్ అకాడమీ నిర్వహించిన కరాటే పోటీల్లో నడకుదురుకు చెందిన ఎం.సాయిరఘు గోల్డ్ మెడల్ సాధించింది. హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నాలుగో నేషనల్ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్–2024 రుద్రమదేవి మెగా కప్ పోటీలు నిర్వహించారు. ఇందులో నడకుదురు గ్రామానికి చెందిన విద్యార్థిని సాయిరఘు (డిగ్రీ సెకండియర్) గ్రీన్ బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్టు కరాటే మాస్టర్, కోచ్ యు.లోవరాజు సోమవారం ఇక్కడ తెలిపారు. కరాటే గ్రాండ్ మాస్టర్, సినీ నటుడు సుమన్ చేతులమీదుగా సాయిరఘు గోల్డ్ మెడల్ తీసుకున్నట్టు చెప్పారు.